సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 12 । నవంబర్ । 2024



డ్రోన్ సాయంతో గంజాయి సాగు ధ్వంసం

గంజాయి సాగుపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. జి.మాడుగుల మండలంలోని సొలభం పంచాయతీ డేగలరాయి కొండల్లో సోమవారం డ్రోన్ సాయంతో గంజాయి తోటలను గుర్తించి, అటవీ, రెవెన్యూ అధికారుల సహకారంతో ధ్వంసం చేశారు.

8లో

న్యూస్‌రీల్

అబుల్ కలాం ఆజాద్‌కు ఘన నివాళి



మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

సాక్షి,పాడేరు: భారతదేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేసి చరిత్రలో నిలిచారని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన జయంతి సందర్భంగా మైనారిటీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో చిత్రపటానికి కలెక్టర్, జేసీ అభిషేక్‌గౌడ్, ముస్లిం మత పెద్దలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ స్థాపకుడిగా భారతదేశం గుర్తించిందన్నారు. డీఆర్వో పద్మలత, మైనారిటీ సంక్షేమసంఘం పీడీ బీఎం రహీం, వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ అహ్మద్ మొహిద్దీన్ పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ నిర్మాణానికి స్థల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్

డుంబ్రిగుడ: మండలంలోని రైల్వే క్రాసింగ్ వద్ద జాతీయ రహదారి ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించి పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ సోమవారం స్థల పరిశీలన చేశారు. రాజమహేంద్రవరం – విజయనగరం జాతీయ రహదారిలో వాహన రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఈ నిర్మాణం చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించి స్థలాలను, రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. స్థల సేకరణపై గిరిజనులతో సబ్‌కలెక్టర్‌తో మాట్లాడారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటిస్తే మంచి ధర

- కాఫీ రైతులకు ఐటీడీఏ కాఫీ విభాగం ఏడీ అశోక్‌కుమార్ సూచన



రైతులకు సూచనలిస్తున్న ఐటీడీఏ కాఫీ విభాగం ఏడీ అశోక్‌కుమార్

డుంబ్రిగుడ: అరకు కాఫీ పంటకు అంతర్జాతీయంగా గుర్తింపు ఉండేలా నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఐటీడీఏ కాఫీ విభాగం ఏడీ ఎస్.అశోక్‌కుమార్ సూచించారు. మండలంలోని సొవ్వ పంచాయతీ సాగరవలస, గసభ పంచాయతీ గొందివలస, మొర్రిగుడ, సాగర గ్రామాల్లో సోమవారం కాఫీ గింజల సేకరణ, ఐటీడీఏ, జీసీసీ ప్రకటించిన మద్దతు ధరలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ, జీసీసీ కాఫీ పండ్లు కిలో రూ.44, పార్చ్‌మెంట్ కాఫీ రూ.285, చెర్రీ కాఫీకి రూ.150 చొప్పున ధరలు ప్రకటించాయన్నారు. అందుకు తగ్గట్టుగా నాణ్యత ప్రమాణాలు పాటించి మద్దతు ధరను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాఫీ ఉద్యానవన అధికారి ఎస్.మత్స్యరాజు, ఫీల్డ్ కన్సల్టెంట్లు, జీసీసీ సిబ్బంది, లైజన్ వర్కర్లు, కాఫీ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక పూజలు



పాడేరులోని ఉమానీలకంఠేశ్వరస్వామిని దర్శించుకుంటున్న శివభక్తులు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా శివాలయాల్లో కార్తీక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజాము ఐదు గంటల నుంచి భక్తులు అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం దీపారాధన జరిపించారు. పట్టణంలోని ఉమానీలకంఠేశ్వరస్వామి, త్రిలింగేశ్వరస్వామి, పాతపాడేరులోని గౌరీ నీలకంఠేశ్వరస్వామి, లగిశపల్లి, తురాయి మెట్ట, గడ్డంపుట్టు, వంజంగి, తామరాపల్లి, సంగోడి శివాలయాలన్నీ భక్తులతో సందడి నెలకొంది. ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు పాలు, ప్రసాదం పంపిణీ చేశారు.

మాట తప్పిన కూటమి



హామీల ఊసెత్తకపోవడం అన్యాయం. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే 19 సంవత్సరాల నుంచి 59 ఏళ్ల వయసు గల మహిళలకు ప్రతి నెలా రూ.1500 ఆర్థికసాయం అందిస్తామన్న చంద్రబాబు ఇచ్చిన మాట తప్పారు. మహిళలకు ఏడాదికి రూ.18 వేల అందిస్తామని ప్రకటించిన ఆయన ఈ పథకానికి నిధులు కేటాయించకపోవడం దారుణం.

– బురిడి రాధ, పెద్ద గంగగుడ్డి, సుంకరమెట్ట పంచాయతీ

విద్యార్థులకు మొండిచెయ్యి



ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు వారి తల్లుల ఖాతాలో తల్లికి వందనం పేరిట నగదు జమ చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ప్రస్తుత బడ్జెట్‌లో మొండి చెయ్యి చూపారు. గత ఏడాది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మా కుమార్తె జ్యోతికి అమ్మ ఒడి పేరిట తల్లి ఖాతాలో నగదు జమ చేశారు. ఈ పథకం మొత్తం ఎప్పుడు జమ చేస్తారో కూటమి ప్రభుత్వం ప్రకటించాలి. – కొర్ర డొంబు, దుంగ్యాపుట్ట, బష్కి పంచాయతీ

తల్లికి వందనంపై నిర్లక్ష్యం



తల్లికి వందనం పథకం అమలుపై కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది.గత ప్రభుత్వంలో అమ్మ ఒడి ద్వారా సకాలంలో మా ఖాతాలో రూ.15 వేలు జమ చేశారు.మా ఇద్దరు పిల్లల చదువుకు ఆర్థికంగా ఎంతో ఉపయోగపడేది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నేటికీ తల్లికి వందనంపై స్పష్టత ఇవ్వడం లేదు.

– లబుడు భవాని, కొత్తూరు, ముంచంగిపుట్టు మండలం

అన్నీ కోతలే..

- బడ్జెట్‌లో సూపర్ సిక్స్ హామీలు గాలికి..
- మహిళలు, నిరుద్యోగులకు అన్యాయం
- రైతుల నోట్లో మట్టి.. విద్యార్థుల సాయానికి మంగళం
- బడ్జెట్ ద్వారా మరోసారి బాబు మార్క్ మోసం



ఆదివాసీ ప్రాంతాలకు మొక్కుబడిగా నిధులు

విశాఖ సిటీ: ఇంటర్ వరకు చదువుతున్న ప్రతి పిల్లాడికి రూ.15 వేలు అంటూ తల్లికి.. ప్రతి నెల రూ.1,500 ఆర్థిక సాయం అంటూ మహిళలకు.. పెట్టుబడి సాయం కింద ఏటా రూ.20 వేలు అంటూ అన్నదాతకు.. ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. అధికార పీఠం కోసం అలవి కాని హామీలిచ్చిన చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక ఎప్పటిలాగే తూచ్ అన్నారు. అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఇందుకు నిదర్శనం. ఇందులో సూపర్ సిక్స్ ఊసేలేదు. రైతుకు భరోసా లేదు. తల్లికి వందనం లేదు. మహిళలకు ఆర్థిక సాయం లేదు. నిరుద్యోగులపై కనీసం దృష్టిపెట్టలేదు. అలాగే నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు, మెట్రో రైలుకు, పర్యాటకాభివృద్ధికి, అనకాపల్లి పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు పైసా కూడా కేటాయించలేదు. ఎన్నికలకు ముందు ప్రతి సభలోను హామీల కూత పెట్టిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక మాత్రం గత ప్రభుత్వ పథకాల్లోనే కోతలు పెట్టారు. కొత్త పథకాలకు పైసా కూడా విదల్చని బాబు.. ఉన్న పథకాలకు సైతం మంగళం పాడేలా బడ్జెట్ కేటాయింపులు చేసి మరోసారి తన బుద్ధి చూపించారు.

విశాఖ ప్రస్తావనే లేదు..

విశాఖను ఆర్థిక రాజధానిగా చేస్తామని చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఎన్నికలకు ముందు ఊదరగొట్టారు. కానీ అధికారం చేపట్టాక రాష్ట్ర ఖజానాను నింపుకోవడానికే విశాఖను ఉపయోగించుకున్నారన్న విషయం తేటతెల్లమవుతోంది. విశాఖకు మెట్రో రైలు, ప్రత్యేక రైల్వే జోన్, పర్యాటకాభివృద్ధికి విభిన్నమైన ప్రాజెక్టులు అని గప్పాలు కొట్టిన చంద్రబాబు.. ఇప్పుడు బడ్జెట్ కేటాయింపుల్లో ఉమ్మడి విశాఖ ప్రస్తావనే చేయకపోవడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. ప్రత్యేక రైల్వే జోన్ పనులను పరుగులు పెట్టిస్తామని ఇటీవలే చంద్రబాబు విశాఖ పర్యటనలో ప్రకటనలు చేశారు. అయితే జోన్ ఏర్పాటుకు అవసరమయ్యే మ్యాచింగ్ గ్రాంట్ నిధులకు మాత్రం బడ్జెట్‌లో కేటాయించలేదు. త్వరలోనే మెట్రో రైలు పనులు ప్రారంభమవుతాయని చెప్పినప్పటికీ.. బడ్జెట్‌లో ఆ ప్రాజెక్టు ఊసు కూడా లేదు. ఇక పర్యాటకం విషయాన్ని కనీసం పట్టించుకోలేదు.

ఎదురుచూపులు

పెట్టుబడి సాయం కోసం రైతులు.. అమ్మ ఒడి కోసం తల్లులు ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వంలో పంట వేయడానికి ముందే రైతు భరోసా కింద రైతుల ఖాతాలో రూ.13,500 జమయ్యేవి. ఎన్నికలకు ముందు కేంద్రంతో సంబంధం లేకుండా రూ.20 వేలు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చేశారు. కానీ కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా ఇప్పటి వరకు ఒక్క పైసా పెట్టుబడి సాయం కింద అందించలేదు. పైగా పంట బీమా భారాన్ని కూడా రైతులే భరించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అలాగే గత ప్రభుత్వంలో అమ్మ ఒడి కింది ఇంటర్ వరకు చదివే విద్యార్థుల తల్లుల ఖాతాలో ఏటా రూ.15 వేలు వేసేవారు. ఆ పథకానికి పేరు మార్చి ఇంట్లో ఎంత మంది చదువుకునే పిల్లలు ఉన్నా అందరికీ రూ.15 వేలు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు ఆ తల్లులకు కూడా ఒక్క రూపాయి **అందించలేదు. అలాగే 19 నుంచి 50 ఏళ్లలోపు మహిళలకు ప్రతి నెల రూ.1500, నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం.. ఇలా అనేక హామీలకు బడ్జెట్‌లో ప్రస్తావనే లేదు. కూటమి ప్రభుత్వ బడ్జెట్‌లో కేటాయింపులపై అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.**

విశాఖపై చిన్నచూపు



కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విశాఖ జిల్లాకు తీవ్ర అన్యాయం చేసింది. పోలవరం ఎడమ కాలువ పనుల పూర్తికి ప్రాధాన్యం ఇవ్వలేదు. వ్యవసాయం పట్ల చిన్నచూపునకు ఈ బడ్జెట్ ఒక సంకేతం. స్టీల్ ప్లాంట్ ప్రస్తావన లేదు. జిల్లాలో మూసివేసిన షుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామన్న హామీ లేదు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి హామీలు ఎప్పుడు హామీలు చేస్తారో చెప్పలేదు.

– కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి, సీపీఎం

ఉత్తరాంధ్రకు మరోసారి దగా..



రాష్ట్ర బడ్జెట్ తీవ్ర నిరాశ పరిచింది. ఈ ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున పోరాడుతున్నా, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రక్షిస్తామనే కనీస ప్రస్తావన కూడా బడ్జెట్ ప్రసంగంలో లేదు. రాష్ట్రంలోనే అతి పెద్ద భారీ పరిశ్రమగా ఉన్న దీనిని కాపాడుకోకుండా, ఎన్ని పారిశ్రామిక విధానాలు ప్రకటించినా, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేస్తామన్నా ప్రజలను మోసగించడం తప్ప మరొకటి కాదు. రాష్ట్ర విభజన చట్టంలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీలపై రాష్ట్ర ప్రభుత్వం గమనించినట్లే లేదు. గిరిజన ప్రాంతంలో జీవో నెం 3 పునరుద్ధరణ ప్రస్తావన లేకపోవడం, గిరిజన యువత ఉపాధిపై తీవ్రంగా ఉంటుంది. గిరిజన కార్పొరేషన్‌ను బలోపేతం ఆలోచన కూడా ప్రభుత్వానికి లేదు. – ఎ.అజశర్మ, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి

రైతులకు మోసం



బడ్జెట్‌లో రైతులకు మేలు జరిగే అంశాలు లేవు. గత ప్రభుత్వంలో ఖరీఫ్ సీజనుకు ముందుగానే పెట్టుబడి సాయంగా నగదు వేసేవారు. కూటమి ప్రభుత్వం రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. ఇప్పుడు బడ్జెట్ చూస్తే కొంత మంది రైతులకే సాయం అందుతుందని తెలుస్తోంది. ఇంత మోసం చేస్తారనుకోలేదు.

– తమరాన నర్సింహమూర్తి, రైతు, కె.వెంకటాపురం, కోటవురట్ల మండలం

చెరకు ఊసెత్తలేదు



బడ్జెట్‌లో చెరకు పంట ఊసెత్తలేదు. ఇప్పటికే చెరకు సాగుకు రైతులు ముందుకు రావడం లేదు. కనీసం గిట్టుబాటు ధరపై ప్రోత్సాహమైనా ఇస్తారని ఆశ పడ్డాం. కానీ ఏమీ ప్రకటించలేదు. జూన్ నెలలో ఇవ్వాల్సిన పెట్టుబడి సాయం ఇప్పటి వరకు అందలేదు. ఇంకా ఇప్పుడు బడ్జెట్‌లో పెట్టామని, అది కూడా కేంద్రం ఇచ్చే రూ.6 వేలతో కలిపి రూ. 20 వేలు ఇస్తామని చెబుతున్నారు.

– పాము అప్పలనాయుడు, చెరకు రైతు, చోడవరం

బడ్జెట్‌లో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం

- అరకొరగా నిధుల కేటాయింపు
- జనాభా ప్రాతిపదికన కేటాయించాలని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్



మాట్లాడుతున్న ధర్మన్నపడాల్, బాల్‌దేవ్

పాడేరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం చేసిందని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్. ధర్మన్నపడాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాల్‌దేవ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఆదివాసీల సంక్షేమానికి కేవలం రూ.7557 కోట్లు కేటాయించడాన్ని సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. జనాభా 6.57 శాతం ప్రాతిపదికన బడ్జెట్‌లో నిధులు కేటాయించాల్సి ఉండగా కేవలం 2.57 శాతం మాత్రమే కేటాయించడం సరికాదన్నారు. ఈ మేరకు రూ.19,374కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ.7557 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకుందన్నారు. ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు, బ్యాగ్‌లాగ్ పోస్టుల భర్తీ ప్రస్తావనే లేదన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో అక్షరాస్యత పెంపు, మౌలిక వసతుల కల్పన, జీసీసీ అభివృద్ధి, అటవీ ఉత్పత్తుల కొనుగోలు, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడం వంటి వాటికి నిధుల కేటాయింపు చేయకపోవడం సరికాదన్నారు. ఆదివాసీలను మోసం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఉందన్నారు. దీనిని నిరసిస్తూ సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

దగా చేసిన కూటమి ప్రభుత్వం

అరకులోయ టౌన్: బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో ఆదివాసీలకు కూటమి ప్రభుత్వం దగా చేసిందని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు లోత రాంబాబు, కిల్లో సురేంద్ర విమర్శించారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్ అంకెల గారడీ బడ్జెట్‌గా ఆరోపించారు. ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల, జీవో నంబర్ 3 చట్టబద్ధతపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయలేదని విమర్శించారు. బడ్జెట్‌లో ఆదివాసీలకు సముచిత స్థానం కల్పించకపోవడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ఆదివాసీలకు జనాభా ప్రాతిపదికన కాకుండా కేవలం 2.57 శాతం మేర మాత్రమే కేటాయించడం సరికాదన్నారు.



మాట్లాడుతున్న కిల్లో సురేంద్ర, రాంబాబు

నిబంధనలు పాటించాల్సిందే

రిస్టార్టుల నిర్వాహకులకు చింతపల్లి డీఎస్పీ ఆదేశం



మాట్లాడుతున్న డీఎస్పీ షహజాన్ అహ్మద్

చింతపల్లి: పర్యాటక ప్రాంతాల్లో రిసార్టుల నిర్వాహకులు నియమ నిబంధనలు పాటించాలని చింతపల్లి డీఎస్పీ షేక్ షహజాన్ అహ్మద్ ఆదేశించారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో లంబసింగి, తాజంగి, పెదబరడ పంచాయతీల్లో రిసార్టుల నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. పర్యాటకుల రాక పెరుగుతుండటంతో రిసార్టుల ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. రిసార్టుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రిసార్టులకు వచ్చే వారి వివరాలను రికార్డుల్లో పక్కాగా నమోదు చేయాలని సూచించారు. పారిశుధ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. నిర్వాహకులకు ఎటువంటి సమస్య తలెత్తినా తమ దృష్టికి తీసుకురావాలని డీఎస్పీ ఆదేశించారు. సీఐ వినోద్‌బాబు, ఎస్ఐ వెంకటరమణ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

పాడేరు ఐటీడీఏ పీవోకు అరకు ఎంపీ తనూజరాణి వినతి

పాడేరు : గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజారాణి కోరారు. ఈ మేరకు సోమవారం ఐటీడీఏ పీవో అభిషేక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూగిరిజన ప్రాంతాల్లో చాలా చోట్ల బడిఈడు పిల్లలు ఉన్నప్పటికీ పాఠశాలలు లేక డ్రాపౌట్లుగా మిగిలిపోతున్నారన్నారు. అటువంటి చోట ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేసి ఉపాధ్యాయులను నియమించాలన్నారు. చాలా గ్రామాల్లో నేటికి తాగునీరు, రహదారి, రవాణా సౌకర్యాలు లేవన్నారు. గ్రామాల్లో గిరిజనులు సమస్యలతో సహవాసం చేస్తున్నారన్నారు. గతంలో వర్షాలు, వరదల కారణంగా చాలా చోట్ల రహదారులు, వంతెనలు ధ్వంసమయ్యాయని, ఇప్పటికీ వీటికి మరమ్మతులు చేపట్టలేదన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్, అడ్డుమండ సర్పంచ్ శ్యాంసుందర్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి కొమ్మా పద్మనాభం, కోటిబాబు పాల్గొన్నారు.



పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్‌కు వినతిపత్రం అందజేస్తున్న అరకు ఎంపీ తనూజరాణి

వంజంగి కిటకిట



సాక్షి,పాడేరు: ప్రకృతి అందాలకు నిలయమైన వంజంగి హిల్స్‌కు సోమవారం పర్యాటకులు భారీగా తరలి వచ్చారు. ఉదయం ఐదు గంటల నుంచి తాకిడి నెలకొంది. పొగమంచు, మేఘాలు, సూర్యోదయం అందాలను తిలకించారు.

15న పుణ్యనదీ హారతి



వరాహ పుష్కరిణి

సింహాచలం: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 15న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ వరాహ పుష్కరిణి(కోనేరు)కి పుణ్యనదీ హారతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఆ రోజు సాయంత్రం 4.30 గంటలకు కొండదిగువ దేవస్థానానికి ఉపాలయమైన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి స్వామి ఉత్సవమూర్తులు వెంకన్న, శ్రీదేవి, భూదేవిలను తిరువీధిగా వరాహ పుష్కరిణి వద్దకు తీసుకెళ్తామన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి షోడశోపచార పూజలు, నక్షత్ర హారతి, కుంభ హారతిలను స్వామివారికి, వరాహ పుష్కరిణికి అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఆ సమయంలో దీపాలను వెలిగించే అవకాశం భక్తులకు కల్పిస్తున్నట్టు తెలిపారు. నూనె, ప్రమిదలు, ఒత్తులు దేవస్థానమే ఉచితంగా అందజేస్తుందని పేర్కొన్నారు.

వైద్య సేవలు విస్తృత పర్చాలి

డీఐవో డాక్టర్ సీహెచ్ సాధన



సింగర్భలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఐవో డాక్టర్ సాధన

జి.మాడుగుల: గ్రామ స్థాయిలో వైద్యసేవలు విస్తృత పరిచి మెరుగైన వైద్యం అందించాలని డీఐవో డాక్టర్ సీహెచ్ సాధన తెలిపారు. సోమవారం ఆమె మండలంలో పర్యటించారు. గెమ్మెలి పీహెచ్‌సీ పరిధిలోని తిమ్మగుండంలో నిర్వహించిన ఎఫ్‌డీపీ వైద్య శిబిరాన్ని పరిశీలించారు. దీంతోపాటు స్థానిక పీహెచ్‌సీ పరిధి సింగర్భ సచివాలయంలో 104 వైద్య శిబిరాలను ఆమె నోడల్ అధికారి కైలాస్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఐరన్ మాత్రలు, సిరప్ పంపిణీపై ఆరా తీశారు. 104 వాహనంలో మందుల నిల్వలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాబ్జి, సీహెచ్‌వోలు పి.జ్యోతి, నీలమేఘన, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సిరిసామ పద్ధతిలో మంచి దిగుబడి

విజయనగరం వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త పాత్రో



అవగాహన కార్యక్రమంలో రైతులు, శాస్త్రవేత్తలు

డుంబ్రిగుడ: సామను గిరిజన ప్రాంతంలో సిరిసామ పద్ధతిలో సాగు చేస్తే మంచి దిగుబడి సాధించవచ్చని విజయనగరం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త పాత్రో సూచించారు. సోమవారం సొవ్వ పంచాయతీ కరకవలసలో సామ రైతులకు సాగు విధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎదజల్లే పద్ధతిలో సాగు చేస్తే కేవలం రెండు నుంచి మూడు క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వస్తుందన్నారు. అదే వాసన్ సంస్థ రైతులకు పరిచయం చేసిన సిరిసామ పద్ధతిలో సాగు చేయడం వల్ల ఎకరాకు పది నుంచి 11 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. అనంతరం పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాడేరు డాట్ సెంటర్ శాస్త్రవేత్త ప్రదీప్, వ్యవసాయ శాఖ నుంచి ప్రకాష్, వసన్ సంస్థ నుంచి సన్యాసిరావు, సంజీవని సంస్థకు చెందిన దేవుళ్లు హాజరయ్యారు. సొవ్వ సచివాలయం హార్టికల్చర్ అసిస్టెంట్ రాములమ్మ, గిరిజన రైతులు పాల్గొన్నారు.

మట్టి, ఇసుక మాఫియా ఆగడాలకు చెక్

- నాలుగు టిప్పర్లు, జేసీబీని సీజ్ చేసిన తహసీల్దార్
- ఇద్దరిపై కేసు నమోదు



ఆదివారం అర్ధరాత్రి టిప్పర్లను పట్టుకున్న తహసీల్దార్ సుబ్బారావు, వీఆర్వో

ఎటపాక: ఆంధ్రా టూ తెలంగాణ.. మట్టి, ఇసుక అక్రమ వ్యాపారం కొందరికి కాసులు కురిపిస్తోంది. యథేచ్ఛగా సాగుతున్న ఈ మాఫియా దందాకు రెవెన్యూ అధికారులు ఎట్టకేలకు చెక్ పెట్టారు. ఎటపాక మండలంలోని పిచుకలపాడు నుంచి టిప్పర్లలో మట్టిని సరిహద్దున ఉన్న తెలంగాణ రాష్ట్రం భద్రాచలం పట్టణానికి తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారం మేరకు వారు అప్రమత్తమయ్యారు. దీనిలో భాగంగా ఆదివారం రాత్రి జేసీబీతో మట్టి తవ్వుతున్న ప్రాంతానికి తహసీల్దార్ కారం సుబ్బారావు సిబ్బందితో వెళ్లారు. అక్కడ మట్టిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న నాలుగు టిప్పర్లు, జేసీబీని సీజ్ చేసి స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. వీరిని గమనించిన జేసీబీ డ్రైవర్ పరారయ్యాడు.

అక్రమ వ్యాపారానికి అడ్డాగా..

తెలంగాణ రాష్ట్ర సరిహద్దున ఉన్న ఎటపాక మండలం భద్రాచలం పట్టణంలోని అక్రమ వ్యాపారులకు అడ్డాగా మారింది. ఈ క్రమంలోనే మట్టి, ఇసుక వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు. భద్రాచలం పట్టణవాసులకు ఇసుక కావాలన్నా.. మట్టి కావాలన్నా సరిహద్దు ప్రాంతంపై డేగల్లా వాలిపోతున్నారు.

సూత్రధారులపై కేసు

ఎటపాక మండలం చింతలగూడెం గ్రామానికి చెందిన రవి, భద్రాచలం పట్టణంలోని వాసు మట్టి, ఇసుక అక్రమ తరలింపులో కీలకపాత్ర పోషిస్తున్నారు. వీరు రాత్రివేళ భద్రాచలం పట్టణానికి మట్టి, ఇసుక తరలిస్తూ కాసులు ఆర్జిస్తున్నారు. ఇప్పుడు స్వాధీనం చేసుకున్న టిప్పర్లు కూడా వారికి చెందినవేనని తహసీల్దార్ కారం సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు వారిద్దరిపై కేసు నమోదు చేస్తున్నట్టు ఆయన వెల్లడించారు. ఇలావుండగా వీరి అక్రమాలకు గతంలో పోలీసు, రెవెన్యూ శాఖల్లో కొందరి అండదండలు ఉన్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. గుండాలలోని స్టాక్ పాయింట్‌లో బినామీల పేర్లతో ఇసుకను బుక్ చేసుకుంటూ తెలంగాణలోని పట్టణాలకు టిప్పర్లతో తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో గిరిజనుడి మృతి

- విద్యుత్ స్తంభం ఎక్కిన మతిస్థిమితం లేని వ్యక్తి
- ట్రాన్స్‌ఫార్మర్ వైర్‌ను తాకడంతో మృత్యువాత


ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకి షాక్‌కు గురై మృతి చెందిన గిరిజనుడు

జి.మాడుగుల: మతిస్థిమితం లేని వ్యక్తి విద్యుత్ స్తంభం ఎక్కి ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ వైరును తాకడంతో షాకుకు గురై అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. ఈ సంఘటనపై గ్రామస్తులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. జి.మాడుగుల మండలం సొలభం పంచాయతీ సింగరాజుపేట గ్రామంలోని తమ బంధువుల ఇంటికి అరకులోయ మండలం మత్రిగూడ గ్రామానికి చెందిన శివ అనే వ్యక్తి రెండు రోజుల క్రితం వచ్చాడు. మతిస్థిమితం లేక ఆయన గ్రామంలో తిరుగుతూ సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎక్కి, వైరును తాకడంతో షాక్‌కు గురై మృతి అక్కడికక్కడే మృతి చెందినట్టు గ్రామస్తులు తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు


అదృశ్యమైన యువతి నవ్యశ్రీ

చింతూరు: స్థానిక బీసీ కాలనీకి చెందిన చేబ్రోలు నవ్యశ్రీ అనే యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చింతూరు ఎస్ఐ రమేష్ సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన నవ్యశ్రీ తిరిగి ఇంటికి రాకపోవడంపై తండ్రి వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రమేష్ తెలిపారు. నవ్యశ్రీ ఆచూకీ తెలిసిన వారు చింతూరు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

దువ్వాడ మీదుగా ప్రత్యేక రైలు



తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా మాల్డా టౌన్–ఎస్ఎంవీ బెంగళూరు–మాల్డా టౌన్ మధ్య స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. మాల్డా టౌన్–ఎస్ఎంవీ బెంగళూరు(03403) అన్ రిజర్వ్‌డ్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 11వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు మాల్డా టౌన్‌లో బయల్దేరి మరుసటిరోజు మధ్యరాత్రి(13వ తేదీ తెల్లవారు)1 గంటకు దువ్వాడకు, అదేరోజు రాత్రి 7 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో (03404) ఈ నెల 14వ తేదీ ఉదయం 7 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరులో బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 2.28 గంటలకు దువ్వాడకు, 16వ ఉదయం 8 గంటలకు మాల్డా టౌన్ చేరుకుంటుంది.

జీతం కోతలతో 'ఉక్కు'రిబిక్కిరి!

- గత నెల జీతంలో ఇంకా 50 శాతం పెండింగ్
- ఈ నెల కేవలం 35 శాతమే ఖాతాల్లో జమ
- కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన తర్వాత మరింత కోత
- రోజు రోజుకీ కుంగిపోతున్న ఉద్యోగులు, కార్మికులు
- ఉక్కు ఉద్యమాన్ని నీరుగార్చేందుకేనని సంఘాల ఆరోపణ

కొండ నాలిక్కి మందు అడిగితే.. ఉన్న నాలుక ఊడేలా చేశాడంట వెనకటికో ప్రబుద్ధుడు. ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్ విషయంలో కూటమి ప్రభుత్వ వ్యవహార శైలి దీనికి భిన్నంగా ఏమీ లేదు. జీతాలు సరిగా ఇవ్వట్లేదని, దీనిపై చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర ప్రభుత్వం దగ్గర మొరపెట్టుకుంటే.. తాజాగా మరో 15 శాతం అదనపు కోత విధించారు. మొదటి విడతలో 50 శాతం ఇంకా పెండింగ్‌లో ఉంది. ఇప్పుడు ఏకంగా 65 శాతం పెండింగ్‌లో పెట్టి, జీతంలో కేవలం 35 శాతం మాత్రమే చెల్లించి స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం చేతులు దులిపేసుకుంది. ప్రభుత్వానికి మొరపెట్టుకుంటే మంచి జరుగుతుందని భావించిన ఉద్యోగులు కోతల వెతలు మరింత పెరగడంతో నైరాశ్యంలోకి వెళ్లిపోయారు.

సాక్షి, విశాఖపట్నం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు యాజమాన్యం మరోసారి షాక్ ఇచ్చింది. సెప్టెంబర్ నెలకు సంబంధించి 50 శాతం జీతం పెండింగ్‌లో ఉండగా అక్టోబర్ నెల జీతం నుంచి తొలివిడతలో కేవలం 35 శాతమే చెల్లించడంతో ఉద్యోగులను గందరగోళంలోకి నెట్టేసింది. ఎన్ని కుయుక్తులు పన్నుతున్నా.. వెరవకుండా.. ఏళ్లతరబడి ఉద్యమాలు చేసి.. స్టీల్‌ప్లాంట్‌ని కాపాడుకునేందుకు శ్రమిస్తున్న ఉద్యోగులు, కార్మికుల ఆర్థిక మూలాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దెబ్బకొడుతున్నాయి. పోరాటం చేస్తున్న వారి ఆత్మస్థైర్యాన్ని, ఆర్థిక ఆసరాని ఛిద్రం చేస్తే.. ఉద్యమాన్ని నీరుగార్చొచ్చన్న కుతంత్రంతో ప్రభుత్వం వ్యవహరిస్తోంది.

కూటమి వచ్చాకే స్టీల్‌ప్లాంట్ కుదేల్

అధికారంలోకి రాకముందు వరకూ విశాఖ స్టీల్ ప్లాంట్‌ని కాపాడుకుంటామంటూ చంద్రబాబు, పవన్‌కల్యాణ్ బీరాలు పలికారు. తీరా కూటమి పేరుతో అధికారంలోకి వచ్చాక.. కార్మికుల ఆకలి కేకల్ని పట్టించుకోవడం మాట దేవుడెరుక.. మరింత కుంగదీసేలా వ్యవహరిస్తున్నారు. నష్టాల పేరిట పది



నెలలుగా ఉద్యోగులకు యాజమాన్యం ప్రతి నెలా సగం జీతం చొప్పున నెలలో రెండు విడతలుగా చెల్లిస్తోంది. మొదటి విడత 50 శాతాన్ని 10వ తేదీలోపు, మిగిలిన జీతాన్ని నెలలో చివరి వారంలో ఖాతాల్లో జమ చేసేవారు. సెప్టెంబర్ నెలకు సంబంధించి అక్టోబర్‌లో కేవలం 50 శాతం మాత్రమే చెల్లించారు. మిగిలిన 50 శాతం పెండింగ్‌లో ఉండగానే.. అక్టోబర్ నెల జీతం చెల్లింపుల్లో మరింత కోత విధించారు. కేవలం 35 శాతం మాత్రమే ఉద్యోగుల ఖాతాల్లో యాజమాన్యం జమ చేసింది. దీనిపై నిలదీసేందుకు ఉద్యోగులు ప్రయత్నించినా.. ఉన్నతాధికారులు ఎవరూ స్పందించడం లేదు.

మొరపెట్టుకుంటే.. మరిన్ని ఇబ్బందులు

గతంలో ఏనాడూ జీతాలకు ఇబ్బంది రాలేదని, కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచే జీతాల కష్టాలు వచ్చాయని ఉద్యోగులు వాపోతున్నారు. రూ.1650 కోట్లు ప్యాకేజీ ఇచ్చామని చెప్పి జీఎస్టీ, బ్యాంకు రుణాల చెల్లింపు పేరిట వెనక్కి తీసుకోవడం కేంద్ర బీజేపీ, రాష్ట్ర టీడీపీ నేతల స్కెచ్‌లో భాగమని విమర్శిస్తున్నారు. ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేసి వీఆర్ఎస్ ద్వారా బయటకు వెళ్లగొట్టేలా చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సెప్టెంబర్, అక్టోబర్‌కు సంబంధించి నెలా 15 రోజుల జీతాన్ని యాజమాన్యం పెండింగ్‌లో పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీతాల రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామంటూ ఇటీవలే చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు కొంతరు ఉద్యోగ, కార్మిక సంఘాల నేతలు విన్నవించుకున్నారు. ఆ తర్వాతే.. గత నెలకు సంబంధించి మిగులు జీతం చెల్లించకపోవడంతోపాటు, ఈ నెల అదనంగా 15 శాతం కోత పెట్టారని వాపోతున్నారు. ప్రభుత్వానికి ఏ సమస్య గురించి చెబుతున్నా.. అది మరింత జటిలమవుతోందనే భావన ఉద్యోగుల్లో మొదలైంది. ఈ వ్యవహారంలో గుర్తింపు యూనియన్ నాయకుల భాగస్వామ్యం ఉన్నట్లు కొందరు కార్మికులు ఆరోపణలు చేస్తున్నారు. ఉద్యోగుల జీతాల చెల్లింపులో యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరిని కూటమి నేతలు పట్టించుకోకపోవడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

14 నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

- కలెక్టర్ దినేష్‌కుమార్
- ప్రచార పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ అభిషేక్‌గౌడ్, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, ఇతర అధికారులు

సాక్షి,పాడేరు: క్యాన్సర్‌కు సంబంధించి మూడు రకాల స్క్రీనింగ్ పరీక్షలు ఈనెల 14నుంచి జిల్లా వ్యాప్తంగా జరుగుతాయని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రచార పోస్టర్లను సోమవారం ఆయన జేసీ డాక్టర్ ఎంజే అభిషేక్ గౌడ్, డీఎంహెచ్‌వో జమాల్‌బాషాతో కలిసి కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్‌లకు సంబంధించి ఇంటింటికీ వచ్చి ఉచితంగానే ఎన్‌సీడీ పరీక్షలు చేస్తారన్నారు.18ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికి ఈ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. బీపీ, షుగర్, హెచ్‌బీ పరీక్షలు కూడా చేస్తారన్నారు. అసాధారణ కేసులను వైద్యాధికారులు పరీక్షిస్తారని, అనుమానిత వ్యక్తులను ఫాస్ట్ ట్రాక్ ఛానల్‌తో కేజీహెచ్‌లోని ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్ సూచిస్తారని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఒక్కరు స్క్రీనింగ్ పరీక్ష జరుపుకోవడం ద్వారా క్యాన్సర్ మహమ్మారిని ముందుగానే గుర్తించి తగిన వైద్యసేవలు పొందవచ్చని ఆయన సూచించారు.

14న వలంటీర్ల జిల్లా సదస్సు


మాట్లాడుతున్న వలంటీర్ల రాష్ట్ర కమిటీ సభ్యుడు జానీ

చింతూరు: రంపచోడవరంలో ఈనెల 14న సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగే వలంటీర్ల జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పాడియం జానీ కోరారు. సోమవారం చింతూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాగానే వలంటీర్ వ్యవస్థను కొనసాగించడంతో పాటు వేతనాలు పెంచుతామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఆ విషయాన్ని విస్మరించిందన్నారు. దీంతో వలంటీర్లంతా అయోమయంలో కొట్టు మిట్టాడుతున్నారని అన్నారు. వలంటీర్ వ్యవస్థను కేవలం రాజకీయంగా చూస్తున్నారే తప్ప ఆ వ్యవస్థ వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాల గురించి ఆలోచించకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో వలంటీర్ల అంశంపై ప్రభుత్వం చర్చించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రంలోని వలంటీర్లంతా కలసి అసెంబ్లీని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి పాడియం లక్ష్మణ్, వలంటీర్ల మండల కార్యదర్శి కలుముల మహేష్, దుర్గారావు, వనరాజు పాల్గొన్నారు.

రేపటి నుంచి సీజీఆర్ఎఫ్ సదస్సులు

సాక్షి, విశాఖపట్నం : ఏపీఈపీడీసీఎల్ పరిధిలో పలాస, విశాఖపట్నం జోన్–2, రంపచోడవరం, జంగారెడ్డిగూడెం డివిజన్లలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 13 నుంచి సదస్సులు నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్‌పర్సన్, విశ్రాంతి జడ్జి బి.సత్యనారాయణ తెలిపారు. 13న పలాస డివిజన్‌లోని ఇచ్ఛాపురం సెక్షన్‌లోను, 19న విశాఖపట్నం జోన్–2 డివిజన్‌లోని మల్కాపురం సబ్ డివిజన్‌లోనూ, 28న రంపచోడవరం డివిజన్‌లోని అడ్డతీగల సెక్షన్‌లో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 29న జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలోని కొయ్యలగూడెంలో సదస్సు జరగనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సదస్సుల్లో నేరుగా పాల్గొని విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం మొదలైన సమస్యలపై ఫిర్యాదులు చెయ్యవచ్చని సూచించారు. దీంతోపాటు కనెక్షన్ పేరుమార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్ ఫార్మర్ల మార్పిడి, తదితర విద్యుత్ సంబంధిత సమస్యలపై ఫిర్యాదులను చైర్‌పర్సన్, సీజీఆర్ఎఫ్ కమిటీకి తెలియజేయవచ్చని స్పష్టం చేశారు. సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న సీజీఆర్ఎఫ్ కార్యాలయానికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసే అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సదస్సులకు సీజీఆర్ఎఫ్ కమిటీ సభ్యులు ఎస్.మసిలమణి, షేక్ బాబర్ హాజరుకానున్నారు.

గ్రామాల్లో ఎన్‌పీసీఐ డ్రైవ్

- సంక్షేమ పథకాలు పొందేందుకు మ్యాపింగ్ అవసరం
- అరకు పోస్టల్ ఐపీవో లక్ష్మీకిషోర్


సుజనకోటలో గిరిజనులకు ఎన్‌పీసీఐ మ్యాపింగ్ చేస్తున్న పోస్టల్ సిబ్బంది


ఆముదాలబందలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ


అప్పలరాజుపేటలో గ్రామస్తుల వివరాలను సేకరిస్తున్న సిబ్బంది

ముంచంగిపుట్టు: పోస్టల్ శాఖలో ఐపీపీబీ ఖాతాతో ఎన్‌పీసీఐ మ్యాపింగ్, ఆధార్ అనుసంధానం సులభంగా చేసుకోవచ్చునని అరకు సబ్ డివిజనల్ పోస్టల్ ఐపీవో వి.లక్ష్మీకిషోర్ అన్నారు. ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల్లోని పలు గిరిజన గ్రామాల్లో అనకాపల్లి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఎన్‌పీసీఐ డ్రైవ్‌ను సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా చేపట్టిన మ్యాపింగ్, ఆధార్ అనుసంధానం ప్రత్యేక డ్రైవ్‌ను ఐపీవో సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఐపీవో లక్ష్మీకిషోర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు లబ్ధిదారుల వ్యక్తిగత ఖాతాలో జమ అయ్యేందుకు ఎన్‌పీసీఐ మ్యాపింగ్ చేసుకోవాలన్నారు. చాలా మందికి ఎన్‌పీసీఐ మ్యాపింగ్ లేక ఉపాధి కూలీ డబ్బులు, సబ్సిడీలు వంటి జమ కావడం లేదన్నారు. దీనినిపై పోస్టల్ శాఖ ప్రత్యేకంగా దృష్టి పెట్టిందన్నారు. గ్రామాల్లో ఎన్‌పీసీఐ మ్యాపింగ్, ఆధార్ అనుసంధానం కాని లబ్ధిదారులను గుర్తించి, వారి వద్దకే పోస్టల్ బీపీఎంలు, ఏబీపీఎంలు సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో వెళ్లి మ్యాపింగ్ చేసి, అనుసంధానం చేస్తున్నారని, ప్రజలంతా ఈ సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

రాజవొమ్మంగి: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంటి ముంగిటకే రావాలంటే ప్రతి ఒక్కరు ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) లింక్ చేయించుకోవాలని పోస్టల్ శాఖ సిబ్బంది గ్రామ గ్రామానా ప్రచారం చేస్తున్నారు. సోమవారం మండలంలో గల 20 బ్రాంచ్ పోస్టాఫీసులకు చెందిన బీపీఎంలు (పోస్టుమాస్టార్లు) ఇంటింటికి వెళ్లి ఆధార్ నంబర్‌ను బ్యాంకు ఖాతా, ఇతర పోస్టల్ పథకాలకు అనుసంధానం చేశారు. రాజవొమ్మంగి సబ్ పోస్టుమాస్టార్ అజయ్‌కుమార్, బీపీఎంలు సీతారామరాజు, శివ, రమణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గంగవరం : మండలంలోని ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను పంచాయతీ కార్యదర్శి కృష్ణస్వామి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధార్‌కార్డుకు ఫోన్ నెంబర్ అనుసంధానం, బ్యాంకు ఖాతాకు ఆధార్, ఫోన్ నంబర్ల అనుసంధానం, తదితర సేవలను చేశారు. గ్రామంలో పలువురికి బ్యాంకు ఖాతాల సదుపాయం కల్పించారు. ఈ డ్రైవ్‌ను ఎంపీడీవో రామకృష్ణ పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. సబ్ పోస్టుమాస్టర్ శివ ప్రసాద్ తదితరులున్నారు.

నాటు వైద్యంతో ప్రాణాలకు ముప్పు

- పసరుమందుతో ప్రాణాలు తీయకండి
- నాటు వైద్యులకు పీవో అపూర్వభరత్ సూచన


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పీవో అపూర్వభరత్

చింతూరు: పసరుమందు వేసి చిన్నారుల ప్రాణాలు తీయవద్దని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ నాటు వైద్యులకు సూచించారు. ఇటీవల చింతూరు డివిజన్‌లో అధికంగా చిన్నారుల మరణాలు సంభవించిన నేపథ్యంలో సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో నాటు వైద్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పీవో అపూర్వభరత్ మాట్లాడుతూ చిన్నారులకు పసరు మందు వేయడం వలన ఆరోగ్యం క్షీణించి, శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారి మృతి చెందుతున్నారని చెప్పారు. నాటు వైద్యంతో ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందన్నారు. నాటుమందు పేరుతో చిన్నారుల ఒంటిపై వాతలు పెట్టడం సరి కాదని, తెలిసీ తెలియని వైద్యంతో చిన్నారుల మరణాలకు కారకులు కావద్దని ఆయన వారికి హితవు పలికారు. నాటువైద్యం కోసం ఎవరైనా చిన్నారులను తీసుకొస్తే వారికి అవగాహన కల్పించి సమీప ఆస్పత్రులకు పంపాలని ఆయన సూచించారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రుల్లో చిన్నారులకు అధునాతన వైద్యం అందుబాటులోకి వచ్చిందని, చింతూరు ఏరియా ఆస్పత్రిలో చిన్న పిల్లల వైద్య నిపుణులు కూడా ఉన్నారని పీవో వారికి వివరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య మాట్లాడుతూ పసరు మందు వేయడం వలన చిన్నారుల గుండె సైజు పెరిగి శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారి మరణాలు సంభవిస్తున్నాయన్నారు. అనారోగ్యానికి గురైన వెంటనే ఆస్పత్రులకు తీసుకురాకుండా అత్యవసర పరిస్థితుల్లో తీసుకురావడంతో పరిస్థితి విషమించి చిన్నారుల మరణాలు సంభవిస్తున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యువో సుజాత, వీఆర్ పురం ఎస్ఐ సంతోష్‌కుమార్, చిన్నపిల్లల వైద్య నిపుణులు శ్రీహర్ష, డాక్టర్ ఉమర్ పాల్గొన్నారు.

డ్రోన్ సాయంతో గంజాయి సాగు ధ్వంసం


దేగలరాయిలో డ్రోన్ సాయంతో గంజాయి తోటల గుర్తింపును పరిశీలిస్తున్న ఎస్పీ అమిత్ బర్దర్


దేగలరాయిలో గంజాయి సాగును పరిశీలిస్తున్న ఎస్ఐ షణ్ముఖరావు అధికారులు


దేగలరాయి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్పీ అమిత్ బర్దర్

జి.మాడుగుల: గంజాయి సాగుపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. మండలంలోని సొలభం పంచాయతీ దేగలరాయి కొండల్లో సోమవారం డ్రోన్ సాయంతో గంజాయి తోటలను గుర్తించి, అటవీ, రెవెన్యూ అధికారుల సహకారంతో ధ్వంసం చేశారు. మండలంలో కొంతమంది గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని సాగుచేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. దీనిలో భాగంగా దేగలరాయి గ్రామ పరిసరాలను డ్రోన్ సాయంతో పరిశీలించారు. సుమారు 20 చోట్ల ఐదు ఎకరాల్లో రెండు అడుగుల ఎత్తు పెరిగిన వెయ్యి గంజాయి మొక్కలను గుర్తించారు. ఈ ప్రాంతాన్ని అటవీ, రెవెన్యూశాఖల సిబ్బంది, స్థానిక పోలీసులతో కలిసి ఎస్పీ అమిత్ బర్దర్ సోమవారం పరిశీలించారు. గుర్తించిన గంజాయి మొక్కలను ధ్వంసం చేయించి నిప్పు అంటించారు. గంజాయి సాగును గుర్తించిన భూములకు సంబంధించిన యజమానులపై చర్యలకు రంగం సిద్ధం చేస్తున్నారు. దీనిలో భాగంగా వారి వివరాలను రెవెన్యూ అధికారుల నుంచి తెలుసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు.

చట్టపరమైన చర్యలు : ఎస్పీ అమిత్ బర్దర్



గంజాయి సాగు, రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అమిత్ బర్దర్ హెచ్చరించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ డ్రోన్ సాయంతో తోటలను గుర్తించి ధ్వంసం చేస్తున్నామన్నారు. జి.మాడుగుల మండలం దేగలరాయి పరిసరాల్లో గతంలో పోలీసులు సర్వే చేసినట్టు చెప్పారు. అప్పటిలో చిన్నమొక్కలు కావడం వల్ల డ్రోన్‌కు కనిపించలేదని, ఇప్పుడు ఎత్తు పెరగడం వల్ల గుర్తించగలిగామని తెలిపారు. సొలభం పంచాయతీలో గంజాయికి ప్రత్యామ్నాయంగా సిల్వర్ ఓక్ తదితర వివిధ రకాల పంటలకు సంబంధించి 17,927 మొక్కలు నాటుకునేందుకు ప్రోత్సహిస్తున్నట్టు ఎస్పీ వివరించారు. కొంతమంది వ్యక్తులు అక్కడక్కడ గంజాయి సాగు చేస్తున్నట్టు తెలుస్తోందని, వారి వివరాలు సేకరించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

స్టీల్ మెల్ట్‌షాప్–1లో ఉత్పత్తి రికార్డులు


స్టీల్ మెల్ట్ షాప్‌లో ఉత్పత్తి ప్రక్రియ

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్–1లో ఉత్పత్తి రికార్డులు కొనసాగుతున్నాయి. స్టీల్ మెల్ట్ షాప్–1లోని ఉద్యోగులు ఈనెల 8న ఒక షిఫ్ట్‌లో రెండు కన్వర్టర్లలో 23 హీట్లు ఉత్పత్తి చేసి రికార్డు నమోదు చేశారు. 10వ తేదీన ఒక షిఫ్ట్‌లో ఒక కన్వర్టర్‌లో రికార్డు స్థాయిలో 14 హీట్లు ఉత్పత్తి చేశారు. అదే రోజు మూడు షిఫ్ట్‌ల్లో ఒక కన్వర్టర్‌లో 37 హీట్లు నమోదు చేసి గత రికార్డులను తిరగ రాశారు. స్టీల్‌ప్లాంట్ ప్రారంభం నుంచి ఇవే అత్యుత్తమ ఉత్పత్తి రికార్డులు కావడం గమనార్హం. ఈ సందర్భంగా విభాగం ఉద్యోగులను అధికారులు, వివిధ సంఘాల నాయకులు అభినందించారు.

38 వన నర్సరీల్లో 37.3 లక్షల మొక్కల పెంపకం

సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో లక్ష్మణ్

కె.కోటపాడు: జిల్లాలోని 38 వన నర్సరీల్లో 37 లక్షల 30 వేల మొక్కలను పెంచుతున్నామని జిల్లా సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో జి.లక్ష్మణ్ చెప్పారు. వీటిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో 32 లక్షల 20 వేల మొక్కల పెంపకం చేపట్టామని ఆయన తెలిపారు. ఈ ఏడాది కాలంలో రైతులకు ఉచితంగా పంపిణీ చేయడంతోపాటు ప్రభుత్వ స్థలాల్లో, రోడ్లకు ఇరువైపులా నాటేందుకు వీటిని వినియోగిస్తామన్నారు. మండలంలో రామచంద్రపురం, కొత్తూరు, సింగన్నదొరపాలెం, బత్తివానిపాలెం గ్రామాల్లో గల వన నర్సరీలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ మొక్కలను రైతులకు అందించేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. వీటితోపాటు కంపా స్కీమ్‌లో భాగంగా లక్షా 60 వేల మొక్కలను, సేల్ ఆఫ్ సీలింగ్స్ కింద లక్ష, ఎస్టీపీసీ నిధులతో 2 లక్షలు, జీరో వన్‌సైన్ మిక్స్‌డ్ ప్లాంటేషన్ కింద మరో లక్ష మొక్కలను నర్సరీలలో పెంచుతున్నట్లు ఆయన తెలిపారు. నర్సరీలలో సరుగుడు, నీలగిరి మొక్కలను ఆరు నెలల కాలం పెంచనున్నట్లు ఆయన తెలిపారు. టాల్ ప్లాంటేషన్ మొక్కలను ఏడాదిపాటు నర్సరీలలో పెంచడం వలన మొక్కలు ఆరోగ్యకరంగా ఎదుగుతాయని, తద్వారా నర్సరీ నుంచి నాటేందుకు తీసుకువెళ్లిన ప్రతి మొక్క బతుకుతుందని ఆయన తెలిపారు. అనకాపల్లి జిల్లా రేంజ్ అధికారి జి.చంద్రశేఖర్, డిప్యూటీ రేంజ్ అధికారి ఎ.నూకరాజు, వన సేవకుడు చిరికి గోవింద పాల్గొన్నారు.

అద్దె చెల్లించకపోవడంతో సచివాలయానికి తాళాలు


తాళాలు వేసిన లోపూడి సచివాలయం


బయట నిరీక్షిస్తున్న సచివాలయ సిబ్బంది

బుచ్చెయ్యపేట : ప్రైవేటు భవనంలో నడుస్తున్న సచివాలయానికి నెలవారి చెల్లించాల్సిన అద్దె ఇవ్వకపోవడంతో ఇంటి యజమాని తాళాలు వేసిన ఘటన లోపూడిలో జరిగింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో సచివాలయానికి సొంత భవనానికి నిధులు మంజూరు చేసినా కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయలేదు. దీంతో లోపూడి సచివాలయ భవనం అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. అయితే ప్రతి నెలా చెల్లించాల్సిన అద్దె చెల్లించకపోవడంతో ఇంటి యాజమాని సోమవారం ఉదయం సచివాలయ భవనానికి తాళాలు వేశారు. దీంతో విధులకు వచ్చిన అధికారులు దిక్కుతోచక బయటే ఉండిపోయారు. తనకు రావాల్సిన అద్దె మొత్తం ఇస్తేనే తాళాలు తీస్తానని ఇంటి యజమాని అధికారులకు తేల్చి చెప్పేశారు. సచివాలయ సెక్రటరీ రామిరెడ్డి తాను ఇటీవలే కొత్తగా విధుల్లో చేరానని, పంచాయతీ రికార్డులు తనకు ఇంకా అప్పగించలేదన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసికెళ్లి పది రోజుల్లో అద్దె చెల్లిస్తామని సర్ది చెప్పారు. దీంతో భవన యజమాని తాళాలు తీయడంతో సిబ్బంది లోపలకు వెళ్లి విధులు నిర్వర్తించారు.

9 కిలోల కనుజు మాంసం పట్టివేత


స్వాధీనం చేసుకున్న కనుజు మాంసం

కోటవురట్ల : కనుజు మాంసాన్ని కలిగి ఉన్న ఓ వ్యక్తిని అటవీశాఖాధికారులు అరెస్టు చేశారు. నర్సీపట్నం ఫారెస్టు రేంజర్ లక్ష్మీనర్సు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అటవీశాఖాధికారులకు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు పందూరు గ్రామంలో అటవీశాఖాధికారులు సోమవారం దాడి చేశారు. గ్రామానికి చెందిన బంగారి అప్పారావు ఇంటిపై దాడి చేయగా ఫ్రిజ్‌లో నిల్వ చేసిన 9 కిలోల కనుజు మాంసాన్ని పట్టుకున్నారు. మాంసాన్ని స్వాధీనం చేసుకుని బంగారి అప్పారావును అరెస్టు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని తెలిపారు.